

# ఘనంగా బతుకమ్మ సంబురాలు

దస్తురాబాద్, అక్టోబర్ 27 : మండల కేంద్రంతో పాటు మున్యాల, భూత్కూర్, మున్యాల గోండు గూడెం, ఆకొండపేట తదితర గ్రామాల్లో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. గునుగు, తంగేడు పూలు, బంతి పూలను సేకరించి రంగు రంగుల బతుకమ్మ తీర్చిదిద్దారు. ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను పెట్టి చిన్నా పెద్ద లేకుండా మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ శుక్రవారం వేకువజామున వరకు సంబురాలను జరుపుకున్నారు. అనంతరం సమీప చేరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

**ఖానాపూర్ మండలంలో..**

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 27 : ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహిం చారు. ఆయా గ్రామాల మహిళలు బతుకమ్మలను రంగులతో అందంగా అలంకరించారు. ఆయా గ్రామాల కూడలిల వద్ద డీజే పాటల మధ్య నృత్యాలు చేస్తూ, కోలాటం వేస్తూ సంబురాలను జరుపు కున్నారు. అర్ధరాత్రి రెండు గంటల వరకు సంబురాలు సాగాయి. బతుకమ్మలను కాలువలు, వాగులు, గోదావరిలో నిమజ్జనం చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.



దస్తురాబాద్ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు, చిన్నారులు



ఖానాపూర్‌రూరల్ : సోమర్‌పేట్‌లో..



గొడిసెర్యాల పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం పెడుతున్న కార్మికులు

## పాఠశాలలో అల్పాహార పథకం ప్రారంభం

దస్తురాబాద్,అక్టోబర్ 27 : గొడిసెర్యాల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సీఎం అల్పాహారం పథకాన్ని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ప్రారంభించారు. ఈ పథకం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ పథకాన్ని ఎంపికైన ఒకే ఒక పాఠశాల గొడిసెర్యాల ప్రాథమికోన్నత పాఠశాల అని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## అధికార ప్రతినిధిగా రామాగౌడ్ ఎన్నిక

కడెం, అక్టోబర్ 27: గౌడజన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర అధికార ప్రతినిధిగా పాతమద్దిపడగ గ్రామానికి చెందిన పంజాల రామాగౌడ్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అమరవేణి నర్సాగౌడ్, రాగుల సిద్ధిరాములుగౌడ్ తెలిపారు.



పంజాల రామాగౌడ్

అనంతరం రామాగౌడ్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రామాగౌడ్‌ను పలువురు అభినందించారు.

## నేడు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం



జాతరకు ముస్తాబైన లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 27 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సూర్జాపూర్ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం రథోత్సవం ఘనంగా జరుగనుంది. శుక్రవారం రాత్రి జాతర జరుగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అర్చకులు నరసింహ మూర్తి , కోటపల్లి అనీశ్, నితీశ్ పాల్గొన్నారు.

## మద్యం పట్టివేత

కుంటాల, అక్టోబర్ 27 : మండలంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు దౌనెల్లి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ చేస్తుండగా రూ. 3900 విలువైన మద్యం పట్టుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హన్మండ్లు తెలిపారు.

**పోలీసుల దాడులు**

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 27 : పలు గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు గుడుంబా, బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. ఐదుగురిని అరెస్టు చేశారు. ఎల్లాపూర్ నడింపల్లెకు చెందిన చెప్పా రమేశ్, కొత్తపేటకు చెందిన పల్లె భాగవ్వ, దిలావర్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తి, ఎల్లాపూర్‌కు చెందిన అలకుంట గంగు, అల్లెపు అక్కక్క, వద్ద మద్యంతో పాటు గుడుంబాను పట్టుకొని స్వాధీం చేసుకున్నారు. పొదల్లో దాచిపెట్టిన బెల్లం పానకాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ సంపత్, ఎస్ఐ రవి కుమార్, ముత్యం, రవీందర్, కల్పన, భాస్కర్, నరేందర్, గౌతం, తేజ, తదితరులు పాల్గొన్నారు.



కుంటాల : పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

## నేటి ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయండి

కడెం, అక్టోబర్ 27 : ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్‌లో శనివారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జొన్నల చంద్రశేఖర్, మల్లారెడ్డి తెలిపారు. శనివారం నిర్వహించే ఈ ఆశీర్వాద సభకు వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు హాజరుకానున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలు, సర్పంచ్‌లు, ప్రజలు తరలిరావాలని వారు కోరారు.

**హరీశ్ రావు సభకు తరలి రావాలి**

దస్తురాబాద్, అక్టోబర్ 27 : శనివారం ఉట్నూర్‌లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ముడికే ఐలయ్య యాదవ్, అర్గుల రాజనర్సయ్య కోరారు. ఈ సభకు ఉదయం 10 గంటలకు రాష్ట్ర ఆర్థిక,వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి తన్నీర్ హరీశ్ రావు రానున్నారని తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ ఆహ్వానం మేరకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## భార్యపై అనుమానంతో ఒకరిపై కత్తితో దాడి

లోకేశ్వరం, అక్టోబర్ 27 : భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో ఒకరిపై కత్తితో దాడి చేసిన ఘటన మండలంలోని గడ్‌చాంద గ్రామంలో చోటుచేసుకుంది, ఎస్ఐ సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల సంజీవ్ తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో అదే గ్రామానికి చెందిన పతనగిరి శ్రీనివాస్ అనే వ్యక్తిపై గురువారం రాత్రి కత్తితో దాడి చేశారు. దీంతో బలమైన గాయమైనట్లు ఎస్ఐ తెలిపారు. వెంటనే అతడిని దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు. శ్రీనివాస్ భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

## వ్యక్తిగత పరిశుభ్రత కిట్‌ల పంపిణీ

భైంసాటౌన్, అక్టోబర్ 27 : మండలంలోని వాలేగాం పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన డెక్కన్ సెరాయ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ యాజమాన్యం రూ. 8 వేలు విలువ చేసే వ్యక్తిగత పరిశుభ్రత కిట్లను అందించింది. ప్రతి కిట్‌లో టూత్ పేస్ట్, బ్రష్, సబ్బులు, షాంపు, బాత్ జెల్, మాయిశ్చరైజర్, దువ్వెన వంటి ఏడు రకాల వస్తువులు ఉన్నాయి. ఈ సందర్భంగా డెక్కన్ సెరాయ్ గ్రూప్ సేల్స్ డైరెక్టర్ కట్కం దత్తాత్రేయ మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## అందుబాటులో శనగ విత్తనాలు

ముథోల్, అక్టోబర్ 27 : ముథోల్‌లోని వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ప్రధాన శాస్త్రవేత్త నర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 25 కేజీల బ్యాగు రూ. 2,500కు ఉన్నట్లు వివరించారు. కావాల్సిన రైతులు నేరుగా పరిశోధన స్థానాన్ని సంప్రదించాలని సూచించారు

# ఓటరు నమోదుకు 31 వరకే గడువు

- **ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తుకు అవకాశం**

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 27 : ఓటరు నమోదుకు కేవలం నాలుగు రోజులే గడువు మాత్రమే మిగిలింది. ఈ నెల 31వ తేదీ వరకు అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు మాత్రమే ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చింది. ఎన్నికలు జరిగే ప్రతిసారి ఓటు శాతం పెంచడం కోసం సంబంధిత అధికారులు ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇందులో భాగంగానే ఓటరు నమోదుకు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తుంటారు. అంతే కాకుండా విస్తృతంగా ప్రచారం చేస్తుంటారు. ప్రజస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఓటు వజ్రాయుధంతో సమానమని, 18 సంవత్సరాలు నిండి ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచిస్తుంటారు. నవంబర్ 30న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నందున ఎన్నికల కమిషన్ ఈనెల 31వ తేదీ వరకు ఓటర్ల నమోదుకు అవకాశం ఇచ్చింది. అ అవకాశాన్ని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం గురించి ఇదివరకే అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, యువజన సంఘాలను ఇందులో భాగస్వాములను చేశారు. ఇప్పటికే ఎన్నికల సంఘం అక్టోబర్ 4న ఓటరు తుది జాబితాను విడుదల చేసింది. ఇదివరకే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. వచ్చేనెల 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరించి, నవంబర్ 30న ఎన్నికలు జరుగనున్నాయి. అయితే ఓటు శాతం పెంపే లక్ష్యంగా అధికారులు ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి నెల రోజుల ముందు వరకు గడువు ఇచ్చింది. అదీ అన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన వారు అధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే మరో నెలలో జరుగబోయే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే సువర్ణావకాశాన్ని పొందు తారు. ఇప్పుడు ఓటరుగా నమోదు చేసుకున్న వారి వివరాలు, జాబితాను పోలింగ్ తేదీ నాటికి అనుబంధంగా ముద్రిస్తారు.

**ఓటరుగా నమోదు చేసుకోవాలి..**



ఓటు వజ్రాయుధంతో సమానం. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఇప్పటికే ఓటు హక్కు వినియోగంతో పాటు ఓటరుగా నమోదు చేసుకోవాలని విస్తృతంగా ప్రచారం నిర్వహిం చాం. ఇప్పటికే ఓటరుగా నమోదు చేసుకున్న వారు తమ ఓటు హక్కు ఉన్నదో లేదో జాబితా ద్వారా పరిశీలించుకోవాలి. జాబితాలో పేర్లు లేకపోతే విధిగా పేర్లు నమోదు చేసుకోవాలి.

**- పరిమాళ్ భౌమిక్ , తహసీల్దార్**